ప్రజాశక్తి

శుక్రవారం 10 అక్టోబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ప్రణాళికతో లక్ష్య సాధనకు కృషి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇంజినీరింగ్ అధికారులు బృందంగా ఏర్పడి, సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చెప్పారు. ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యుఎస్, సమగ్ర శిక్ష అభియాన్, పబ్లిక్ హెల్త్, సిపిడి, విద్యుత్, భూగర్భగనులశాఖ ఇంజినీరింగ్ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పనితీరులో నాణ్యత, చురుకుతనం ఉండాలని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లా అభివృద్ధి కొరకు చక్కని ప్రణాళిక, బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సమగ్ర ప్రణాళికలతో లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా బాపట్ల జిల్లా ఏర్పడిన నాటికి రూ.35 కోట్లు డిఎంఎఫ్ (జిల్లా మినరల్ ఫండ్) నిధులు ఉన్నాయన్నారు. అప్పటినుండి మూడున్నర ఏళ్లలో మరొక రూ.16 కోట్లు జిల్లాకు వచ్చాయన్నారు. మొత్తంగా రూ.51 కోట్ల నిధి జిల్లా మినరల్ ఫండ్ కింద ఉండగా వివిధ శాఖల ద్వారా వివిధ ప్రాంతాలలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. 31 అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.48.28 కోట్లు అధికారికంగా మంజూరు అయ్యాయన్నారు. ఇప్పటివరకు కేవలం రూ.5.77 కోట్లు పనులు మాత్రమే జరగడమే మిటిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న 61 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో తాగునీటిని పరీక్షించాలన్నారు. ఆర్వో ప్లాంట్లు అన్ని వినియోగంలో ఉండాలన్నారు. చీరాల – పిడుగురాళ్ల 167ఏ జాతీయ రహదారిని త్వరగా పూర్తి చేయాలన్నారు. జల జీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంత రాజు, గృహనిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి, సిపిఓ షాలేమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపుతాం

అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ప్రతిపాదనలు ఎన్నికల కమిషన్‌కు పంపుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులతో గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమావేశం నిర్వహించారు. పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియ జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతిపాదనలు, అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, జి.గంగాధర్ గౌడ్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు.. అడుగులు ఎప్పుడు?

- సంక్షేమ ఎజెండాతోనే పాలనాకాలం
- ప్రాజెక్టులు.. ఉపాధి కల్పన.. మౌలిక సదుపాయాలపై దృష్టి ఏదీ?
- చెప్పుకోవడానికి ఏమీ కనిపించక సందిగ్ధంలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా కూటమి సర్కార్ అభివృద్ధి వైపు అడుగులు వేయలేకపోతోంది. ఆర్థిక పరిస్థితులు బాగాలేవనే సాకుతో ఏ పనికీ నిధులు ఇవ్వలేనిదైన్యం కనిపిస్తోంది. కొత్త ప్రాజెక్టులు ఒక్కటంటే ఒక్కటీ రాలేదు. పాత పెండింగ్ పథకాలు, ప్రాజెక్టులను పూర్తిగా వదిలేశారు. అదిగో ఇదిగో అంటూ ఏడాదిగా మాటలతోనే కాలం గడిపారు. కేవలం సంక్షేమ పథకాల అమలుపైనే కసరత్తు సాగించారు. వాటిని అమలు చేయడానికి ఏడాది పట్టింది. తల్లికి వందనం పథకం అమలు చేశాకగానీ సంక్షేమ ఎజెండాకూ ఊపురాలేదు. అప్పటి వరకూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూశారు. ప్రభుత్వంపైనా అసంతృప్తి పెరగడానికి ఈ జాప్యమే కారణంగా ఉంది. సూపర్ సిక్స్‌లో రెండు పథకాలు ఇంకా మిగిలే ఉన్నాయి. ప్రతి మహిళకూ నెలకు రూ.1500, నిరుద్యోగభృతి అమలు కావాల్సి ఉన్నాయి. ఇవి ఎప్పుడన్నదానిపై ఆయా వర్గాల్లో ఎదురుచూపులు తప్పడం లేదు.

ఇక జిల్లాలో రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా ఏం జరిగిందనేదీ పరిశీలిస్తే అభివృద్ధి పరంగా ఏమీలేదు. సాధారణంగా కొన్నిశాఖల్లో చేపట్టే పనులు, సంక్షేమపథకాల కింద లబ్ధిదారులకు సాయాలు వంటివే కనిపించాయి. సిఎం రిలీఫ్ ఫండ్ కింద సాయాలు వంటి వ్యక్తిగత అంశాలూ ప్రధానంగా ఉన్నాయి. ఇవి తప్ప ఎన్నికల్లో ఊరూరా ఇచ్చిన అంశాలపై కదలిక లేదు.

వెలిగొండ నిర్మాణంలో తీవ్ర జాప్యం..

ప్రధానంగా వెలుగొండ ప్రాజెక్టు విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడు జిల్లాలకు కీలకమైన దీనిపై ఉదాసీనంగానే ఉన్నారు. ఇంకా రూ.4వేల కోట్లు కేటాయించాల్సి ఉంది. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. పునరావాసం కల్పించి ముంపు గ్రామాల వారిని తరలించాల్సి ఉంది. ఇవి చేయకుండా కాలువల మరమ్మతులకు టెండర్లు పిలిచారు. పదిహేనేళ్ల క్రితం వందకోట్లతో తవ్విన కాలువకు ఇపుడు రూ.375 కోట్లతో మరమ్మతులకు టెండర్లు పిలిచారు. వెలుగొండ ప్రాజెక్టు ఇప్పట్లో



నిలిచిపోయిన సొరంగం పనులు

పూర్తయ్యేలా లేదు. వచ్చే సీజన్‌కు నీళ్లిస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఇలా చెప్పడం ఆయనకు కొత్తేమీ కాదంటున్నారు. మిగతా సాగునీటి ప్రాజెక్టుల పనులపైనా ఇదే పరిస్థితి. తమ్మవరం ఎత్తిపోతల పథకం ఆగిపోయింది. పాలేరు రిజర్వాయర్ పెండింగులోనే ఉంది. ఉపాధికి సంబంధించి దొనకొండ వద్ద పరిశ్రమల కేంద్రం అతీగతీలేదు. 2014–19 ప్రభుత్వ హయాంలో దీన్ని ప్రకటించారు. ఇక్కడ ఏపిఐఐసికి 2395 ఎకరాలు కేటాయించారు. 1454 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. ఇక్కడ ఒక్కటంటే ఒక్కటీ పరిశ్రమ రాలేదు. కనిగిరి నిమ్జ్‌కు సంబంధించి ఏపిఐఐసికి 1839 ఎకరాలు అప్పగించారు. పీసీపల్లి మండలంలో కందుకూరు–పామూరు రహదారిలో ప్లాట్లు వేశారు. ఇక్కడా ఏ పరిశ్రమ రాలేదు. ▶ 2లో

పెన్షన్ ఉద్యోగుల హక్కు

- పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య కార్యాచరణ చేపట్టాలి
- ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ఎవరి దయా దాక్షిణ్యాలతో లభించింది కాదని, అది ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (ఏపిఆర్ పిఎ) సదస్సు నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షులు జి.శేషయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జిల్లాలోని అన్ని పెన్షనర్ల సంఘాలు పాల్గొన్నాయి. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శాసన మండలి మాజీ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో మూడు నాలుగు దశాబ్దాల పాటు పనిచేసి రాజ్యాంగ బద్ధంగా నెలవారీ పొందుతున్న పెన్షన్‌పై పాలకవర్గాలు ఆంక్షలు విధించడం శోచనీయం అన్నారు. రాజ్యాంగ బద్ధంగా కల్పించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు అనుకూలంగా మార్చుకుని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు లక్షల రూపాయలు జీతాలు, పెన్షన్ పొందడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉద్యోగులు సాధించుకున్న ఓపిఎస్ స్థానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా ఎన్‌పిఎస్, సిపిఎస్, యుపిఎస్ పేరున అమలు చేస్తామంటే పెన్షనర్లు ఏ మాత్రం సహించరని ఓపిఎస్‌ను మాత్రమే అంగీకరిస్తారని స్పష్టం చేశారు. ఏపిఆర్ పిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రతి ఉద్యోగికి హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్, సొమ్ము షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే చర్యలు ఉపసంహరించాలన్నారు. ప్రకాశం జిల్లా ఎన్‌జిఒ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శరత్ బాబు, ఆర్ సిహెచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పిఆర్‌సి, డిఎ చెల్లించాలన్నారు. సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సుబ్బారావు, పిడిసిసి బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.గురవారెడ్డి, ఏపీ ఆర్‌పిఎ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏవి పుల్లా రావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ఎస్బిఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రటరీ పి.దశరథరామయ్య, ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.బ్రహ్మానంద రెడ్డి, బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వివి రత్నం, ఆల్ ఇండియా బిఎస్ ఎన్ఎల్ డిఓటి పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నాగేశ్వర రావు, ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ ఎస్ పోతేరయ్య, జిల్లా ఫైర్ సర్వీస్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.అంజయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్య దర్శి ఎం.రమేష్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఎన్జీవో మహిళా సంఘ జిల్లా కార్యదర్శి రాజ్యలక్ష్మి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఏపీ ఆర్పీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంబాబు, టీవీఎస్ సుబ్బారావు మాట్లాడారు.

బాపట్ల జిల్లా జెసిగా భావన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



బాపట్ల జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా భావనను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం 31 మంది ఐఎఎస్‌ల బదిలీలు జరగ్గా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న భావనను బాపట్ల జిల్లా జెసిగా నియమించారు. గత నెల వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన జె.వెంకటమురళిని సిసిఎల్ఏ అదనపు కార్యదర్శిగా నియమించారు.

విమానాశ్రయ నిర్మాణ పనులు..

వేగవంతానికి సహకరించండి

సిఎంను కోరిన ఎంపి మాగుంట



సీఎం చంద్రబాబుతో ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు విమానాశ్రయం అభివృద్ధి పనులు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు. గురువారం వెలగపూడిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సిఎం చంద్రబాబు నాయుడుని ఒంగోలు ఎంపి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై సిఎంతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం అన్ని రంగాలలో బాగా వెనుకబడి ఉందన్నారు. పార్లమెంట్ పరిధిలో భూ సేకరణ జరిగిన ఒంగోలు విమానాశ్రయం నిర్మాణ అనుమతులు త్వరితగతిన పొంది, పనులు మొదలు పెట్టాలని కోరారు. కొండపి, కనిగిరి, మార్కాపురం యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 39 రోడ్లు పునర్నిర్మాణానికి పిఎంజిఎస్‌వై పథకంలో రూ.135 కోట్లు మంజూరు చేయించాలని సిఎంను కోరారు. కోస్టల్ కారిడార్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పిఎం ఈ–బస్ ▶ 2లో

పాత నేరస్తుల కదలికలపై నిఘా

వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అసాంఘిక శక్తులకు చెక్ పెట్టేందుకు, నేర చరిత్ర ఉన్న ఉన్న వారిపై నిరంతర నిఘా పెట్టేందుకు జిల్లా ఎస్పీ చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ప్రతి రోజు రాత్రి సమయంలో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానితుల నుంచి పోలీసులు వేలిముద్రలు తీసుకుంటున్నారు. అర్ధరాత్రి రోడ్డు మీద తిరుగుతున్న వారిని గుర్తించి వారి నుంచి కూడా వేలిముద్రలు తీసుకుంటున్నారు. ఇలా చేయడం ద్వారా పాత నేరస్తులను గుర్తించతో పాటు జిల్లాలో ఎవరైనా నేరం చేస్తే.. వెంటనే నేరస్తులను పట్టుకునేందుకు వీలుంటుందని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి బిల్డింగ్ వర్క్స్, సిమెంట్ పనులు నిమిత్తం వస్తున్న వారి వద్ద నుంచి హోటల్‌లో పని చేసే వారిన నుంచి కూడా సాయంత్రం సమయంలో ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తునే ఉంటామని ఎస్పీ తెలియజేశారు.



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

అభివృద్ధి వైపు.. అడుగులు ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల రిలయన్స్ సంస్థ బయోఇంధనం ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించగా మంత్రిలోకేష్ శంకుస్థాపన చేశారు. దాని పనుల్లో వేగం లేదు. జిల్లాలో కీలకమైన జిల్లా డెయిరీ, పాలపొడి ఫ్యాక్టరీపై దృష్టిలేదు. కొత్త పరిశ్రమల కోసం తిప్పలు పడుతున్నారు. ఈపాటికే ఉన్నవాటిని మూతపెట్టారు. జిల్లా డెయిరీకి విలువైన స్థలాలను కాజేసేదానిపై దృష్టి తప్ప దాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన కనిపించడం లేదు. జిల్లాలో రెండు ప్రాంతాలకు వారధిగా ఉన్న ఒంగోలు -కర్నూలు రోడ్డు విస్తరణ ఎండమావిగా మారింది. ఇంకా పట్టణాల్లో అండర్‌గ్రౌండు డ్రైనేజీలు, తాగునీటి పథకాలు పెండింగులోనే ఉన్నాయి. ముంపు సమస్యకు పరిష్కారాలు లేవు. వర్షాలకు పట్టణాల్లో శివారుకాలనీలు నీట మునుగుతున్నాయి. ఇక గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పన నిలిచిపోయింది. రోడ్లుకు మరమ్మతులు లేవు. గుంటలు పడి ఉన్నాయి. జాతీయ రహదారులు తప్ప రాష్ట్ర రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇప్పటికీ చెప్పుకోవడానికి ఏ ఒక్కటీ లేదు. తాను ఇది చేశానని జనంలో చెప్పడానికి ఏదీ కనిపించడంలేదు. అభివృద్ధి మార్క్ ఎవరికీ కనిపించడం లేదు. సిఎం చంద్రబాబును కలిసి వినతి పత్రాలు ఇస్తున్నారు. అసెంబ్లీలోనూ కొన్ని సమస్యలపై మాట్లాడుతున్నారు. నిధులు కేటాయించాలని కోరుతున్నారు. ఆచరణలో మాత్రం ఆ నిధులే రావడం లేదు. ఫలితంగా అభివృద్ధి ఎజండా ముందుకు సాగడంలేదు. అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

విమానాశ్రయ నిర్మాణ పనులు.. వేగవంతానికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

సేవా పథకంలో ఒంగోలు ఎపిపిటిడి విభాగానికి ఎలక్ట్రిక్ బస్సులను కేయించేలా కేంద్రంతో సంప్రదించి వాటిని త్వరితగతిన ఏర్పాటు చేయవలసినదిగా ముఖ్యమంత్రిని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కేంద్రంతో సంప్రదించి ఒంగోలు విమానాశ్రయం, పిఎంజిఎస్‌వై పథకంలో రోడ్లు, కోస్టల్ కారిడార్ రోడ్డు, ఒంగోలు ఎపిపిటిడి విభాగానికి ఎలక్ట్రిక్ బస్సులు త్వరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-తర్లుపాడు

ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని హెచ్‌ఓఈ ప్రాజెక్టు ఓఆర్‌డబ్ల్యు కె.అరుణ అన్నారు. హాండ్స్ ఆఫ్ కంప్యాషన్ - పియు ప్రాజెక్ట్స్ బెంజిమెన్ ఆనంద్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశాల మేరకు మండలంలోని కలుజువ్వలపాడు, తుమ్మలచెరువు, చెన్నారెడ్డిపల్లి, వివిధ గ్రామాలలోకి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి ఆరోగ్య ప్రచార రథం గురువారం వచ్చింది. ఎయిడ్స వ్యాధి దరిచేరకుండా ఉండాలంటే ఏయే జాగ్రత్తలు పాటించాలో ఎల్ఈడి స్క్రీన్‌పై చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఎఫ్ఎల్ఎస్ కె ప్రసన్న, ఆర్ నాగేంద్రం పాల్గొన్నారు.

జనసైనికులకు బాలసుబ్రమణ్యం పరామర్శ

ప్రజాశక్తి-మద్దిపాడు

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు జనసైనికులను గురువారం జనసేన మండల అధ్యక్షులు నున్నా బాలసుబ్రమణ్యం పరామర్శించారు. మూడు రోజుల కిందట నెలటూరు గ్రామానికి చెందిన జనసైనికుడు అయినాబత్తిన నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలు రిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బాలసుబ్రమణ్యం రిమ్స్ హాస్పటల్‌కి వెళ్లి నాగేశ్వరరావుని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఖర్చుల నిమిత్తం రూ.3 వేలు అందజేశారు. అదేవిధంగా పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన అంగలకుర్తి శ్రీనివాసరావు మూడు రోజుల కిందట గుండెపోటుకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బాలసుబ్రమణ్యం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈయన వెంట మండల ఉపాధ్యక్షులు దమ్ము సురేష్, తిరుమలశెట్టి చిరంజీవి, అంగలకుర్తి నరసింహం, శంకర్, అయినా బత్తిన జ్యోతి పలువురు నాయకులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న బాలసుబ్రహ్మణ్యం

శిలీంధ్రాల వృద్ధిపై ప్రదర్శనా క్షేత్రం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు మండల వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఒంగోలు ఆత్మ వారి సౌజన్యంతో మండలంలోని పి తక్కెళ్లపాడు, చిలకపాడు, బొడ్డువారిపాలెం గ్రామాలలో గురువారం ట్రైకోడెర్మా విరిడి మరియు మైకోరైజాల శిలీంధ్రాలని నేలలో వృద్ధి చేసే విధానంపై ప్రదర్శనా క్షేత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి పావని మాట్లాడుతూ ఈ ప్రదర్శన ద్వారా విత్తన శుద్ధి మరియు నేలలో శిలీంధ్రం యొక్క అభివృద్ధి చేసుకొనే విధానం గురించి వివరించారు. ఆత్మ బిటిఎం జీ కృష్ణ మాట్లాడుతూ ఆత్మ ద్వారా రైతులకు కావలసిన శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని ప్రదర్శనా క్షేత్రాల ద్వారా ఎప్పటికప్పుడు రైతుల చెంతకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కెవి సుబ్బారెడ్డి, పి తక్కెళ్లపాడు, చిలకపాడు, బొడ్డువారిపాలెం గ్రామాల వ్యవసాయ సహాయకులు డి వెంకటసుమ, డి అమృత కళ, సిహెచ్ సుధీర్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రపంచ ఆరోగ్య వారోత్సవాలను పురస్కరించుకొని సంతనూతలపాడు హైస్కూల్లో గురువారం సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. అనంతరం రోల్ ప్లే స్కిట్‌ను విద్యార్థులు ప్రదర్శించారు.

స్పా సెంటర్లలో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

చట్టవ్యతిరేక, అసాంఘిక మరియు అనైతిక కార్యకలాపాలు కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో కలసి గురువారం ఒంగోలు నగరంలోని స్పా సెంటర్లపై ఏక కాలంలో దాడులు నిర్వహించారు. నగరంలోని 9 స్పా సెంటర్లపై సిఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది 9 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో స్పా సెంటర్ల నిర్వహణకు సంబంధించిన లైసెన్సులు, అనుమతులు, ఉద్యోగుల వివరాలను పూర్తిగా పరిశీలించారు. స్పా సెంటర్లలోని సీసీ కెమెరాల పనితీరు, అంతర్గత నిర్మాణ శైలి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. స్పా, మసాజ్ సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు, అసాంఘిక మరియు అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి ప్రకాశం పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు. స్పా సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధమైన, అసాంఘిక మరియు అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు, ఎస్సైలు నాగమలేశ్వరావు, సుధాకర్, పున్నారావు, అజయ్ బాబు, వెంకట సైదులు, నాగేంద్ర కుమార్, ఫణిభూషణ్ పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బాణసంచా రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి

ఆర్‌డిఒ కళావతి

ప్రజాశక్తి-టంగుటూరు

దీపావళి పండుగ సందర్భంగా బాణ సంచా గోడౌన్‌లో రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఒంగోలు ఆర్డీఓ కళావతి అన్నారు. జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు గ్రామంలో పోలేరమ్మ ఫైర్ క్రేకర్ గోడౌన్‌ను గురువారం ఆర్డీఓ కళావతి గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైర్ క్రేకర్ గోడౌన్‌లో ముందస్తు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ఒంగోలు ఆర్డీవో కళావతి, జరుగుమల్లి తహశీల్దార్ పి మురళీ ఆధ్వర్యంలో చతుకుపాడు పరిధిలోని బాణాసంచా అనుమతులు, రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసూన, వీఆర్వోలు చైతన్య, మధు, యాజమాన్యం తరపున భాస్కర్ పాల్గొన్నారు.

అనుమతులు తీసుకోవాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

రాచర్ల మండలం యడవల్లి పరిధిలో గల దీపావళి మందుల గోడౌన్‌ను గురువారం గిద్దలూరు రూరల్ సీఐ జె రామకోటయ్య ఆకస్మికంగా తనిఖీ చేసారు. గోడౌన్‌లోని సేఫ్టీ ప్రికాషన్స్, స్టాక్‌ను పరిశీలించి ఎలాంటి అనివార్య సంఘటనలు, ఫైర్ ఆక్సిడెంట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పెద్దారవీడు: మండలంలో ఎక్కడైనా ఎలాం టి అను మతి లేకుండా దీపావళి సందర్భంగా బాణా సంచా (క్రాకర్స్) విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని పెద్దారవీడు ఎస్ఐ వి సాంబశివయ్య హెచ్చరించారు. మండల కేంద్రమైన పెద్దారవీడుతో పాటు హనుమాన్ జంక్షన్ (కుంట)లో టపాసులు అమ్ముతున్నారనే అనుమానంతో గురువారం సోదాలు నిర్వహించారు.

సురక్ష చెక్కు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

వాసవీ కుటుంబ సురక్ష పథకం కింద రూ.4,03,800 చెక్కును వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ గంగిశెట్టి కిరణ్‌కుమార్ గురువారం పంపిణీ చేశారు. రీజియన్-1 పరిధిలో మార్కాపురం వాసవీ వనిత క్లబ్ సభ్యురాలు పెసల బాలమ్మ ఇటీవల మరణించారు. బాలమ్మ వారసులు పెసల రవికుమార్‌కు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గంగిశెట్టి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వాసవీ క్లబ్‌లో సభ్యులుగా ఉన్న వారికి ఇలాంటి ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఇసి ఆఫీసర్ సూరె ఉమాదేవి, క్యాబినెట్ సర్వీసెస్ సెక్రెటరీ సూరే సురేంద్ర, రీజియన్ చైర్మన్ నారాయణం వెంకటేశ్వర్లు, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు పరుచూరి ధనలక్ష్మి, కార్యదర్శి టంగుటూరి కళ్యాణి, కోశాధికారి తటవర్తి ఆదిలక్ష్మి, వాసవీ సభ్యులు అచ్యుత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు, అట్టలు పంపిణీ

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మండలంలోని పందిళపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మోక్షగుండం గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు మందేపల్లి కొండయ్య గురువారం పలకలు, అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత కొండయ్యను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అద్దంకి రాజశేఖర్, ఉపాధ్యాయులు నాగమల్లి వరప్రసాద్, పీవీ రాజశేఖర్, జీవీ కృష్ణయ్య, అంగన్‌వాడీ కార్యకర్త కె శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కొండపి

అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా క్విజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయా మండల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. కొండపి మండలానికి సంబంధించిన పోటీలలో కే ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సోమరాజుపల్లి శతి లావణ్య ప్రథమ స్థానం సాధించింది. విద్యార్థినికి హెడ్ ఆఫ్ ది ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ కు చెందిన పి వెంకట్ రెడ్డి సర్టిఫికెట్, మెమొంటోను అందజేశారు. క్విజ్ లో సత్తా చాటిన విద్యార్థిని లావణ్యను మండల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

రసాభాసగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-టంగుటూరు

'గ్రామాలలో ఎక్కడి చెత్త అక్కడే నిలబడి ఉంది. సైడు కాలువలలో మురికి అక్కడే భేషుగ్గా ఉంది. రోడ్ల గుంతలు పూడ్చలేదు, గ్రామాలలోని వీధి కుక్కలు మనుషులను తరుముకొస్తున్నాయి. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదు' అని పొందూరు ఎంపిటిసి పొందూరు నాగేశ్వరరావు, అనంతవరం ఎంపిటిసి కసుకుర్తి కోటేశ్వరరావు వాపోయారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పటాపంచుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. వీరు సమస్యలను లేవనెత్తడంతో సమావేశం రసాభాసగా మారింది. 'పొందూరులో మాజీ సర్పంచి వాటర్ ప్లాంట్ అమ్ముకున్నారు. కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశాము, అయినా అధికారులు ఇంతవరకు పట్టించుకోలేదు. ప్రజల ఆస్తులను దోచుకున్నవారి గురించి అధికారులు పట్టించుకోలేదు. ప్రజా సమస్యలపై ఎంపిటీసీలు స్పందిస్తే అధికారులు పట్టించుకోవడం లేదని పొందూరు ఎంపిటీసి నాగేశ్వరరావు ఆవేదన చెందారు. ఏ గ్రామం చూసినా మురికికూపాలే దర్శనమిస్తున్నాయని అన్నారు. మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేసి సైడు కాలువలలో పూడిక తీయించాలని అనంతవరం ఎంపిటీసి కసుకుర్తి కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి కుక్కలు గ్రామాలలో కార్లను సైతం వెంట బడుతున్నాయి. కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కసుకుర్తి కోటేశ్వరరావు కోరారు. ప్రజలకన్నా కుక్కలు అధికంగా ఉన్నాయి. గ్రామం బాగుండాలంటే సైడు కాలువలు మరమ్మతులు చేయించాలని సభ్యులు కోరారు. కుక్కలు ఉత్పత్తి కాకుండా సంతానోత్పతిత్త తగ్గే విధంగా వ్యాక్సిన్లు వేసి చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి డాక్టర్ ధనలక్ష్మి తెలిపారు. ఎంపిటీసీలకు గౌరవం లేదు, గౌరవ వేతనం కూడా గత రెండు సంవత్సరాల నుంచి లేదని టంగుటూరు-4 ఎంపిటీసీ కొమ్ము ప్రభుదాస్ ఆవేదన చెందారు. ఏదైనా పని చేయించాలన్నా టంగుటూరు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదు. ప్రజా సమస్యలపై తాము ఏమీ చేయలేక పోతున్నామని మెడలో ప్ల కార్డుతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి ఆంజనేయులు, ఎంపిడిఓ దేవసేన కుమారి, టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత, అనంతవరం సర్పంచి ఉప్పలపాటి శివ రామరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ అవినాష్, వ్యవసాయాధికారి డి యుగంధరరెడ్డి, ఎంఈఓ చెల్లి ఆనందరావు, బాలాజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎంపిటిసీ కొమ్ము ప్రభుదాస్

నేటి నుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

ప్రజాశక్తి-రాచర్ల

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం నుంచి ఉపాధ్యాయులు బోధనేతర పనులు, యాప్‌ల విధులను బహిష్కరిస్తున్నట్లు గురువారం రాచర్ల మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో రాచర్ల మండల విద్యాశాఖ అధికారి మొయినుద్దీన్‌కు మెమోరాండం అందజేశారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధన సమయం హరించుకుపోతోందని, ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి క్షీణించిపోయే విధంగా బోధనేతర, యాప్‌ల కార్యక్రమాలు పెరిగిపోయాయని రాచర్ల మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని, మూల్యాంకానికి సంబంధించిన పరీక్షల నిర్వహణ తప్ప మరే ఇతర బోధనేతర పనులు చేపట్టబోమని ఉపాధ్యాయ సంఘ సమాఖ్య ప్రతినిధులు కరాఖండిగా ఎంఈఒకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పి రమణారెడ్డి, జే సుధాకర్, ఎన్ చంద్రశేఖర్, పి వెంకటేశ్వర్లు, ఎస్ రామకృష్ణ, ఏ రమణయ్య, పి పవన్ కుమార్ పాల్గొన్నారు.

నిషేధిత వస్తువుల తరలింపును అరికట్టడమే తనిఖీల లక్ష్యం

ప్రజాశక్తి-గిద్దలూరు

మాదక ద్రవ్యాలైన గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అమ్మకాలు, సేవించడం నియంత్రించేందుకు గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో గురువారం నార్కోటిక్ శిక్షణ పొందిన రాక్సీ జాగిలం, హ్యాండ్లర్ వెంకటేశ్వర్లుతో పోలీసులు వితంగా తనిఖీలు నిర్వహించారు. గిద్దలూరు రైల్వేస్టేషన్, బస్టాండ్, అర్బన్ కాలనీ, దేవాలయాలు, మార్కెట్ ఏరియా, దిగువమెట్ట తండా, రైల్వే స్టేషన్, పిఆర్ కాలేజీ తదితర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పేలుడు పదార్థాలు, గంజాయి, నిషేధిత వస్తువుల తరలింపును అరికట్టడమే ఈ తనిఖీల లక్ష్యమని సీఐలు సురేష్, రామకోటయ్య తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ జిలాని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

షేడ్ నెట్ నర్సరీలు తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఉద్యాన శాఖ కార్యాలయం పరిధిలోని యర్రగొండపాలెం, పెద్దారవీడు మండలాల్లోని షేడ్ నెట్ నర్సరీలను యర్రగొండపాలెం ఉద్యాన శాఖ అధికారి పల్లకి ఆదిరెడ్డి గురువారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సరీ యాక్ట్ ప్రకారం ప్రతి ఒక్క షేడ్ నెట్ నర్సరీ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని లైసెన్సు కలిగి ఉండాలని చెప్పారు. లేనియెడల నర్సరీ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్నవారు రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. కొత్తగా నర్సరీ మొదలు పెట్టినవారు నర్సరీ యాక్ట్ ప్రకారం లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని నర్సరీలను తనిఖీ చేసి లైసెన్సులు, విత్తనం కొన్న బిల్లులు పరిశీలించారు. నర్సరీ యజమానులు మిరప విత్తనాలు అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. వాటికి తగిన బిల్లులు చూపించాలన్నారు.

ఆ భూములపై హక్కులన్నీ మావే..

ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడించిన 'వక్కలగడ్డ'

ప్రజాశక్తి-మార్కాపురం

కొందరు ఎస్సీలు తమను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, తమను చంపేందుకు దాడులకు సైతం పాల్పడుతున్నారని మార్కాపురం పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు ఆరోపించారు. ఈపాటికే తమపై దాడులకు తెగబడుతున్నవారి నుంచి రక్షణ కల్పించాలని జిల్లాలోని రెవెన్యూ పెద్దలకు, పోలీస్ పెద్దలకు విన్నవించుకున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్కాపురం మండలంలోని గోగులదిన్నె ఇలాఖాలో 40 ఎకరాల భూమికి వారికి ఎలాంటి హక్కులు లేకపోయినా 15 ఏళ్లుగా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో భూమి కొనుగోలు చేసిన తాళ్లపల్లి ప్రసాద్, పెరుమాళ్ల శ్రీనివాసరావు, మురళిలకు మద్దతుగా ఆర్యవైశ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొంతల పుల్లారావు, వక్కలగడ్డ సురేష్‌కుమార్, ఇతర ఆర్యవైశ్య ప్రముఖులు యక్కలి కాశీవిశ్వనాథం, తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, లఘుమారపు శ్రీనివాసరావు, ఆలంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సంఘటన స్థలం

బైకును ఢీకొన్న బొలెరో వాహనం

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

బొలెరో వాహనం బైకును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలైన సంఘటన త్రిపురాంతకం మండలంలోని మేడపి శివారు ప్రాంతంలో గురువారం జరిగింది. ఐటి వరం నుంచి మేడపి వస్తున్న బొలెరో వాహనం గణపవరం నుంచి వస్తున్న ముగ్గురు యువకులు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని మేడపి శివారు ప్రాంతంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంద పేరయ్య(19) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో ఇద్దరు పవన్, కోటేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో త్రిపురాంతకం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కోటేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

243 బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 243 బేళ్లు తిరస్కరణ అయినట్లు వేలం నిర్వహణ అధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు 1,268 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 1,025 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 243 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 315,కనిష్ట ధర కేజీ రూ.70, సరాసరి ధర కేజీ రూ.217.65గా నమోదయింది. వేలంలో 16 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని మీర్జాపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ, రిలయన్స్ ఫౌండేషన్ మరియు ఎఫర్ట్ ఎన్జీవో సహకారంతో పశు ఆరోగ్య శిబిరం, పశు గ్రాస రకాలపై పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సహాయ సంచాలకులు డాక్టర్ సిహెచ్ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పశువుల ఆరోగ్యం, డివార్మింగ్, వ్యాక్సినేషన్, పశుగ్రాసాల సాగు, పశు పోషణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో 52 గేదెలు, 350 గొర్రెలు, మేకలకు చికిత్స అందించారు. రైతులకు మందులు, గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు.


ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలోని తాటిచెర్ల గ్రామానికి చెందిన బొమ్మని రమణ పది రోజుల క్రితం రహదారి ప్రమాదంలో మతి చెందాడు. బొమ్మని రమణ భార్య బొమ్మని ధనమ్మ క్యాన్సర్ వ్యాధితో పోరాడుతోంది. ఈ విషయం తెలుసుకున్న కొమరోలు మండల టిడిపి అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని గురువారం తాటిచెర్ల మోటులో తన సొంత నిధులు రూ.25,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా గిద్దలూరు నియోజకవర్గ టిడిపి నాయకులు ముత్తుముల కష్ణ కిషోర్‌రెడ్డి చేతుల మీదుగా ధనమ్మకు రూ.25,000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ధనమ్మ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ధనమ్మ కుటుంబ సభ్యులు బోనేని వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - పంగులూరు



మద్దినేని కోటేశ్వరరావు

సొసైటీలో జరిగిన అవినీతి కారణంగా సొసైటీ లావాదేవీలు స్తంభించి పోయాయని మండలంలోని నూజిళ్ళపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు మద్దినేని కోటేశ్వరరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గతంలో సొసైటీలో అనేక గందరగోళాలు జరిగాయని అన్నారు. ఫలితంగా రైతాంగం ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని షేర్ క్యాపిటల్ లేకుండా రైతులకు నేరుగా రుణాలు ఇచ్చే ఎస్ఎస్ పథకం ద్వారా అమలు చేస్తున్నామని అన్నారు. దీని ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇద్దరు రైతులకు ఒక్కొక్కరికి రూ.8లక్షల చొప్పున రూ.16 లక్షల రుణాలు ఇప్పించామని అన్నారు. సొసైటీలో 40 మంది రైతులు వడ్డీలు కట్టిన మార్చిలో రెన్యువల్ చేయలేదని, వీళ్ళ చేత 7శాతం వడ్డీలు కట్టించేలా నిర్ణయాలు చేయించామని చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్, ఇతర అధికారుల సహకారంతో పూర్వవైభవానికి కృషి చేస్తామని చెప్పారు.



మహిళలకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పేద మహిళలకు మంత్రి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రేపల్లె

పేద మహిళలకు ఆర్థికంగా చేయూతనందించి, అండగా నిలబడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో పట్టణానికి చెందిన పద్యాల గాయత్రి, కావూరి జ్యోతి కుటుంబాలకు ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మేక రామకృష్ణ, పట్టాభి రామారావు, జివి నాగేశ్వరరావు, జనసేన నాయకులు పరిశరాజు, దేవగిరి శంకర్ పాల్గొన్నారు.

వైద్యానికి రూ.3 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరుకు చెందిన షేక్ మహబూబ్ సుభానికి క్యాన్సర్ వైద్యం కోసం సిఎంఆర్ఎఫ్ నుండి రూ.3లక్షలు మంజూరైనట్లు తెలిపారు. తన వైద్య ఖర్చుల విషయమై టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబును సంప్రదించగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో మంజూరు చేయించి గురువారం ఎల్ఒసి అందజేశారు.



మాట్లాడుతునన స్వర్ణ పిహెచ్‌సి డాక్టర్ ప్రదీప్‌కుమార్


గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని స్వర్ణ పిహెచ్‌సిలో ప్రతినెల 9న గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్, హెచ్ఐవి, హెచ్‌బిఎస్ఎజి, హెచ్‌సివి, యూరిన్ అనాలసిస్, సిటీ, బిటి, బ్లడ్ గ్రూప్ వంటి పరీక్షలు నిర్వహించినట్లు ఇన్చార్జి వైద్యాధికారి డాక్టర్ డి ప్రదీప్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ బయ్య శంకర్ తెలిపారు. ముందస్తు పరీక్షలు చేయడం ద్వారా వ్యాధులను గుర్తించి వైద్యం అందించవచ్చని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె మాధవి, మాధురి, సిపోరా, నాగలక్ష్మి పాల్గొన్నారు.

విచారించి చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చెరుకుపల్లి



వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్థానిక ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో విద్యార్థిని కొట్టిన ఘటనలో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ అధికారి జుబేర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. గుళ్ళపల్లి ఎన్ఆర్ఐ కళాశాల ప్రాంగణంలో విద్యార్థిని కొట్టిన సంఘటనపై విచారణకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. కళాశాలలో చల్ల పాల్ గాంధీ అనే విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ చేయి చేసుకోవడంతో పాల్ గాంధీ చేయి విరిగిన ఘటనపై ఎస్ఎఫ్ఐ బృందం కళాశాలను సందర్శించారు. విద్యార్థుల వద్ద వివరాలు సేకరించారు. ఈ ఘటనకు కళాశాల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని, ఆ విద్యార్థి పూర్తిగా కోలుకునే వరకు వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ బృందంలో జిల్లా నాయకులు సూర్య, నవీన్ పాల్గొన్నారు.

తుర్కిస్తాన్ రాయబారిగా ఇంకొల్లు వాసి

ప్రజాశక్తి - ఇంకొల్లు



నియామక పత్రం అందుకుంటున్న విల్సన్

తుర్కిస్తాన్ దేశ భారత రాయబారిగా మండలంలోని ఇడుపులపాడు గ్రామ వాసైన బండారు విల్సన్ బాబు ఉన్నత విధులు నిర్వర్తనించనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి నియామక పత్రం గురువారం అందుకున్నారు. విల్సన్ బాబు ఇప్పటివరకు మడగాస్కర్ దేశలో భారత రాయబారిగా విధులు నిర్వహించారు. ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-96వరకు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివారు. తమ పాఠశాలలో ఉన్నత విద్య చదివిన పూర్వ విద్యార్థి విల్సన్ బాబు పలు దేశాల రాయబార కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తుండటం గర్వకారణంగా ఉందని గ్రామస్థులు అన్నారు. హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి, పాఠశాల పాలకవర్గ అధ్యక్షులు బొగ్గవరపు చెంచు పున్నయ్య, స్కూల్ కరస్పాండెంట్, చైర్మన్ గోరంట్ల పున్నయ్య చౌదరి, సర్పంచ్ బండారు సుమతి, టిడిపి గ్రామ అధ్యక్షులు పేర్ని బాపయ్య చౌదరి అభినందలు తెలిపారు.

సిజె గవాయ్‌పై దాడికి నిరసన



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై కోర్టులో బూటు విసిరిన అడ్వకేట్ రాజేష్ కిషోర్‌పై క్రిమినల్ కేసు తోపాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి కత్తి ఏబు, సిఐటియు నాయకులు షేక్ మౌలాలి, చింతకుంట్ల ఏసు, ధారా నాగార్జున, రమేష్, గురునాథం రాములు, జి నాగయ్య, కాసిం బి, నాగరాజు, బి యెహొషువ, దిలీప్ కుమార్, రవి కుమార్ పాల్గొన్నారు.

బల్లికురవ : సుప్రీం కోర్ట్ సిజె బిఆర్ గవాయ్‌పై బుటు విసిరి దాడికి పాల్పడిన అడ్వకేట్ రాకేష్ శర్మపై కఠిన చర్యలు తీసుకొవాలని ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు పత్తిపాటి నాగయ్య కోరారు. స్థానిక సెంటర్లోని అంబేద్కర్ విగ్రహనికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. సురభి రామారావు, బండారు సారథి, జె రవి, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

జిఎస్‌టితో ఆర్థిక భారం తగ్గింపు

ప్రజాశక్తి - చీరాల



మాట్లాడుతున్న ఎంపీ కృష్ణ ప్రసాద్

సామాన్య ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు అమలు చేస్తోందని ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక ఏరియా హాస్పిటల్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో కలిసి జీఎస్టీపై అవగాహన కల్పించారు. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు, ప్రాణాధార మందులు, ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించడంతో ప్రజలకు ఉపశమనం కలుగుతోందని పేర్కొన్నారు. మందులు, వైద్య పరికరాల ధరలు తగ్గుతాయని తెలిపారు. దీనివల్ల పేదలకు వైద్యం మరింత చౌక అవుతుందని తెలిపారు. ఆహార, ఎలక్ట్రానిక్ వస్తువులపై జిఎస్టీ తగ్గింపుతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం జీఎస్టీపై ప్రకటించిన సడలింపులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ విజయమ్మ, కోఆర్డినేటర్ పద్మావతి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, గుంటూరు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ చైర్మన్ మించాల శ్రీనివాసరావు, ఆర్‌డిఒ చంద్రశేఖర్, తహశీల్దారు గోపి కృష్ణ పాల్గొన్నారు.



చెకుముకి సైన్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెకుముకి సైన్స్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

జెవివి ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయాలని జెవివి జిల్లా అధ్యక్షులు దబ్బకూటి హరిబాబు కోరారు. డిఇఒ ఎస్ పురుషోత్తంతో కలిసి చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ గురువారం ఆవిష్కరించారు. 8, 9,10 తరగతుల విద్యార్థులకు ఈనెల 18న పాఠశాల, నవంబర్ 1న మండల, నవంబర్ 23న జిల్లా, డిసెంబర్ 12 నుండి 14 వరకు రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు కుర్ర రామారావు, యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, జెవివి నాయకులు వై భాస్కరరావు, రాజేష్, కుమార్, వెంకటేశ్వరరెడ్డి, కళాధర్, ఉపాధ్యాయులు చక్రధర్, రవికాంత్, బివి శ్రీనివాసరావు, రమేష్, కె నాగేశ్వరరావు, మజుందార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాష్యం స్కూల్ ఛైర్మన్ రామకృష్ణ

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - రేపల్లె

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని భాష్యం స్కూల్ చైర్మన్ రామకృష్ణ ఉన్నారు. భాష్యం ఒలంపస్ అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జోనల్ అధికారి శ్రీమ న్నారమణ, సబ్ జోనల్ అధికారి రాము, ప్రిన్సిపాల్ భీమ్ రాజ్, హెచ్ఎం వసుంధర, వైస్ ప్రిన్సిపాల్ నరసింహ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొండమంజులూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కోలలపూడి ఉన్నత పాఠశాల్లో బుధవారం జరిగిన డివిజనల్ స్థాయి ఆటల పోటీల్లో కొండ మంజులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. 10వ తరగతి విద్యార్థి కప్పెర జాన్ బాబు అండర్ 17 ఖో ఖో పోటీలకు, చొప్పరపు నవీన్ అండర్ - 14 ఖో ఖో పోటీలకు, వల్లెపు రమ్య జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు హెచ్ఎం ఇమ్మడిశెట్టి అనిత తెలిపారు. పిఇటి హనుమయ్యను గ్రామ పెద్దలు అభినందించారు.

కరాటేలో శిక్షణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక విశ్వ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుండి గ్రామంలోని ఇండస్ వ్యాలి పబ్లిక్ స్కూల్ నందు కరాటే శిక్షణ ప్రారంభిస్తున్నట్లు బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ పూల రాము తెలిపారు. కరాటే శిక్షణ పాఠశాల్లోనే గాక పర్సనల్‌గా ఎవరికైనా కరాటే శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. జూడో, రింగ్ ఫైట్ కూడా నేర్ప బడుతుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ప్రతి ఒక్కరికి ఆత్మరక్షణ విద్యలైన కరాటే చాలా అవసరమని అన్నారు. బాలికలకు మరింత అవసరమని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గిద్దలూరు

అభివృద్ధే ధ్యేయంగా ప్రజా సంక్షేమం తన ఊపిరిగా భావించే ప్రియతమ నేత అందరి బంధువుగా ఉండే గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచుతూ అంగరంగ వైభవంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించుకునేవారికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బి చంద్రశేఖర్ యాదవ్, 5వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి జిల్లెల సంపత్ కుమార్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.




ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి తదితరులు, అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకల్లో గిద్దలూరు మద్దిలేటి

అంగన్‌వాడీ కేంద్రంలో..

గిద్దలూరు పట్టణం పాములపల్లి రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వేడుకలు టీడీపీ తెలుగు యువత నాయకులు గిద్దలూరు మద్దులేటి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా అశోక్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. అనంతరం చిన్నారులకు కేక్స్, బిస్కట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిడతల రవితేజ, బొర్రా రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కొమరోలు మండలం తాటిచెర్ల పంచాయతీలోని తాటిచెర్ల మోటు సెంటర్‌లో కొమరోలు మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి 56వ పుట్టిన రోజు సందర్భంగా 56 కేజీల కేక్‌ను టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి చేతుల మీదుగా కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి.. కొమరోలు ఎస్ఐ నాగరాజును శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పందనబోయిన భూపాల్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ద్వారకచర్లలో..

కొమరోలు మండలంలోని తమ పుట్టిల్లు ద్వారకచర్ల గ్రామంలో బంధువుల ఆధ్వర్యంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. భారీ కేకును కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రాజుపాలెంలో..

కొమరోలు మండలంలోని రాజుపాలెం గ్రామంలో గిద్దలూరు ఏఎంసి వైస్ చైర్మన్ గోడి ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ 56 పుట్టినరోజు దినోత్సవం ఆయన నూరేళ్ల ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆశిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురు స్వామిరెడ్డి, పెద్ది, తోట వెంకటేశ్వర్లు, హైస్కూల్ చైర్మన్ మల్లారపు శ్రీనివాసులు, సల్ల గొలుసుల గురవయ్య, శీలం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ముత్తుముల అశోక్ రెడ్డి తమ్ముడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి హాజరై మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కృష్ణ కిషోర్‌కు పార్టీ నాయకులకు వినిపించారు. కేకులను ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య యాదవ్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కంభం రూరల్: పట్టణంలోని కందులాపురం సెంటర్లో ఉండే గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోదరుడు ముత్తుముల క్రిష్ణ కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి, స్వీట్స్ పంచుతూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం కంభం మండలంలోని రోడ్లు, కాలువలు శుభ్రపరిచే పారిశుధ్య కార్మికులకు మంచినీటి క్యాన్లు పంపిణీ చేశారు. తరువాత నాయకుల ఆధ్వర్యంలో పేద పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకలో కంభం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

రాచర్ల: రాచర్ల మండలంలో గురువారం గ్రామగ్రామాన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాచర్లలో మండల టిడిపి అధ్యక్షులు కటికే యోగానంద్ అధ్యక్షతన మండల తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తల మధ్యలో భారీ కేకు కట్ చేసి ప్రజలందరికీ పంచిపెట్టారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి చరవాణి ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అశోక్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని అందరూ కలిసి ఆనందోత్సాహాలతో భారీ కేకులు కట్ చేసి స్వీట్లు పంచుకొని, ఒకరినొకరు కౌగిలించుకుంటూ ఆనంద కెరటాల్లో తేలిపోయారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పని నిమిత్తం తిరుపతిలో ఉన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అందుబాటులో లేనప్పటికీ, ఎమ్మెల్యే ఫ్లెక్సీలు పెట్టి మండలంలోని 14 పంచాయతీల్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు.

అర్ధవీడు: అర్ధవీడు మండలంలోని చీములేటిపల్లె గ్రామంలో ఘనంగా గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గారి జన్మదినాన్ని అర్ధవీడు మండల టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడు బండమూడి ఆంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు భారీగా కేకులు కోసి, టపాసులు పేలుస్తూ పుట్టినరోజు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి దీర్ఘాయుష్షు, విజయవంతమైన రాజకీయ జీవితం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ఎంపీపీ పాల్గుల పురుషోత్తంరెడ్డి, లాకా రమణ, రంగారెడ్డి కొణతం రంగారెడ్డి, శీను, కాశీరావు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



కొమరోలు తాటిచెర్ల మోటులో కేక్ కట్ చేస్తున్న బోనేని వెంకటేశ్వర్లు



రాచర్లలో కేక్ కట్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు

సబ్ కలెక్టర్ త్రివినాగ్ బదిలీ

ప్రజాశక్తి-మార్కాపురం



మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్ బదిలీ అయ్యారు. తాడేపల్లిలోని గృహ నిర్మాణ శాఖకు బదిలీపై వెళ్లనున్నారు. మార్కాపురం సబ్ కలెక్టర్‌గా ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు.



బోరును ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని కటకానపల్లి గ్రామంలో గురువారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు గత ప్రభుత్వం అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం వహించింది. ఈ ప్రభుత్వం ప్రజలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి సంక్షేమాలపై ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. గత ప్రభుత్వం దళితులపై అనేక దాడులు చేసిందని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని అన్నారు. అనంతరం తాగునీటి బోరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాబు, చంటి, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, ఈదర మల్లయ్య, జనసేన నాయకులు మురళితో పాటు పలువురు పాల్గొన్నారు.



నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

దాహార్తి తీర్చిన ఎమ్మెల్యే తాటిపర్తి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల మండలం నల్లగుంట్ల ఎస్సీ పాలెంలో ఎన్నికల సమయంలో నీటి సమస్య అధికంగా ఉండడంతో వైసీపీ గ్రామ నాయకులు, దోర్నాల మండల పార్టీ అధ్యక్షులు ఘంటా రమణారెడ్డి ఎర్రగొండపాలెం శాసనసభ్యులు దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ వెంటనే గ్రామంలో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఇవాళ స్థానిక వైసీపీ నాయకులు మొద్దు తిరుపతిరావు ఆ బోరుకు మోటారు బిగించి నీటి సరఫరా చేశారు. ఈ సందర్భంగా తమ ఎస్సీ కాలనీకి దాహార్తిని తీర్చిన శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు ఘంటా రమణారెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు మొద్దు తిరుపతిరావు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శింగరాయకొండలో ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ రంజాన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ కంటి ఇనిస్ట్యూట్ అడ్మినిస్టేషన్ జి పద్మ, విజన్ సెంటర్ కోఆర్డినేటర్ ఎం సలాంఖాన్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కొండపి



ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న నాయకురాళ్లు

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతాన్ని కోరుతూ గురువారం పెరిదేపి, మిట్టపాలెం గ్రామాలలో ఐద్వా జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలుగా 1981లో ఏర్పడిన ఐద్వా మహిళా సంఘం కోటి మంది సభ్యులతో నేడు దేశవ్యాప్తంగా విస్తరించి మహిళల హక్కులు, చట్టాల సాధన కోసం పోరాడుతున్నదని తెలిపారు. మహిళా సమానత్వం, అభివృద్ధి కోసం ఉద్యమించాలని, కుటుంబాలను గుల్ల చేస్తున్న మద్యం, మత్తు పదార్థాలను నిర్మూలించాలని, మహిళలు చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలు అరికట్టాలని, మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో సమానత్వాన్ని కల్పించాలని ఈ మహాసభల్లో తీర్మానాలు చేస్తామని, భవిష్యత్తులో వాటి మీద ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరిగే ఈ మహాసభలకు రాష్ట్రంలోని మహిళా ఉద్యమ నేతలు 600 మంది హాజరవుతున్నారని తెలిపారు. గత మూడేళ్లుగా జరిగిన పోరాటాలను సమీక్షించుకొని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఉద్యమాలను ఈ మహాసభల్లో రూపొందిస్తామని తెలిపారు. మహాసభల జయప్రదానికి ప్రజలు అన్ని రకాలుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు అంగలకుర్తి విశ్రాంత, ఏ మాధవి, పెరిదేపి గ్రామ కమిటీ సభ్యులు చాట్రగడ్డ సునంద, మల్లెల సంపూర్ణ, కె ప్రమీల, ఏ పరిమళ, ఎం నల్లమ్మ, ఎల్ కమలమ్మ, ఏ ఆదాము, ఎల్ వరమ్మ, రజని, ప్రవల్లిక, మిట్టపాలెం గ్రామ కమిటీ సభ్యులు సిహెచ్ ఎస్తేరమ్మ, జి సౌజన్య, జి ఏసమ్మ, ఆర్ విశ్రాంత, పెరికల ప్రమీల, పి విమల పాల్గొన్నారు.

జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీలలో..

స్మార్ట్ జెన్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-శింగరాయకొండ



అవార్డులు తీసుకుంటున్న విద్యార్థులు

శింగరాయకొండలోని స్మార్ట్ జెన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఇస్రో ఆధ్వర్యంలో వరల్డ్ స్పేస్ వీక్ సందర్భంగా అక్టోబర్ 8వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలలో ఏడుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలలో ప్రథమ స్థానాన్ని సాధించిన విద్యార్థులలో ఏ చరణ్ సాయి (3వ తరగతి), పి రీతిహాన్ అద్విక్ (1వ తరగతి) ద్వితీయ స్థానాన్ని సాధించిన విద్యార్థులైన సహస్ర (5వ తరగతి), పి జోషిక (4వ తరగతి), పి విహాన్ (2వ తరగతి), తృతీయ స్థానాన్ని సాంధించిన విద్యార్థులలు జి జాన్విక (1వ తరగతి), యు సమిత్ (1వ తరగతి) ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి మాట్లాడుతూ వివిధ కేటగిరిలలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో గెలుపొందిన విద్యార్థులలో 40 శాతం మంది స్మార్ట్ జెన్ విద్యార్థులు విజయం సాధించడం అభినందించదగిన విషయం. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం, కళా నైపుణ్యాల అభివృద్ధి, సామాజిక అవగాహనను కల్పించుట ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను చిత్రరూపంలో తమ ప్రతిభను కనబరచే విధంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.



నినాదాలు చేస్తున్న విఆర్ఎలల సంఘ నాయకులు

విఆర్ఎల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

విఆర్ఎల సమస్యలపై అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో నిరవధిక దీక్షలు జయప్రదం చేయాలని విఆర్ఎల సంఘం జిల్లా గౌరవధ్యక్షులు జి శ్రీనివాసులు కోరారు. స్థానిక తహశీల్దారుకు గురువారం వినతి పత్రం అందజేశారు. పే స్కెల్ ఇవ్వాలని, ప్రమోషన్ ఇవ్వాలని, అక్రమ డ్యూటీలు రద్దు చేయాలనీ, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి జ్యోతి, యేసు, ఏడుకొండలు, హిమాంసాహెబ్, మౌలాలి, మస్తాన్ పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న సంపూర్ణ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని ఐలవరం జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహాలపై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భట్టిప్రోలు సెక్టార్ పరిధిలో సూపర్వైజర్ సంపూర్ణ అధ్యక్షతన పోటీలు నిర్వహించారు. కిషోర్ బాలికలకు బాల్య వివాహాలు, చట్టాలు, అవసరతల గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.



చైర్మన్ సీతారామయ్యను కలిసిన పిఎసిఎస్ చైర్మన్లు

పారదర్శకత పాటించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

ఒంగోలులో నిర్వహించబడిన 74వ మహాజన సభ ఆకర్షణగా నిలిచింది. చీరాల పిఎసిఎస్ చైర్మన్ కోటి కృష్ణమోహన్, పందిళ్ళపల్లి పిఎసిఎస్ చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, చీరాల సీఈఓ కె కిషోర్ కుమార్, వై రమేష్ బాబు పాల్గొన్నారు. ఒంగోలు పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. చీరాల, పందిళ్ళపల్లి పిఎసిఎస్‌ల పరిధిలోని రైతుల రుణాల సమస్యలపై సమగ్ర చర్చించారు. సమయానుకూలంగా రైతులకు రుణ సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అల్లర్లు సృష్టించడమే జగన్ కుట్ర

ప్రజాశక్తి-దర్శి

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే తప్పేమిటని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రశ్నించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేనప్పుడు ఈ విధానం ద్వారా పేద విద్యార్థులకు మేలు చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయాన్ని స్వాగతించకుండా జగన్ అండ్ సైకో బ్యాచ్ అడ్డుకునే కుట్రలలో భాగంగా నర్సీపట్నం పర్యటనని విమర్శించారు. గత ఐదేళ్లు వైసిపి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ఒక్కటైనా నిర్మించిందాని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు సంకల్పానికి జగన్ సైకో బ్యాచ్ అడ్డుపడుతుందని ఆరోపించారు.

పరీక్షలకు సమాయత్తం కావాలి

ప్రజాశక్తి - కనిగిరి



అవగాహన కల్పిస్తున్న డిఇఒ కిరణ్ కుమార్

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధులుగా చేయాలని డిఇఒ ఎ కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి, లింగారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిలబస్ బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. లింగారెడ్డిపల్లి పాఠశాలలో కిచెన్ గార్డెన్ పెంపకం బాగుందని అభినందించారు. మధ్యాహ్న భోజన పథకం రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు డివి సుబ్బారావు, యు నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, హెచ్ఎంలు విజయభాస్కరరెడ్డి, జి కోటిరెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం దహనంపై నిరసన

ప్రజాశక్తి - బాపట్ల



పట్టణంలో టిడిపి నాయకులు నిరసన ర్యాలీ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కూటమి నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. విగ్రహానికి నిప్పు పెట్టిన దుర్మార్గపు చర్యను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు చిత్తూరు జిల్లాలో నారాయణస్వామి తన అనుచరుడితో మతవిద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసిపి కుట్రలకు తెరతీస్తుందని అన్నారు. వైసిపి సర్పంచ్ గోవిందయ్య హస్తం ఉందని పోలీసు దర్యాప్తులో బహిర్గతమైందని అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన గోవిందయ్యను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పర్చూరు



పరిశీలిస్తున్న కాంట్రాక్టర్, అధికారులు

పిడుగురాళ్ల, ఓడరేవు జాతీయ రహదారిలో నాగులపాలెం వద్ద సర్వీసు రోడ్డు లేకపోవడం, డ్రెయిన్ తక్కువ వెడల్పు కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై స్పందించిన ఆయన హైవే అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. అధికారులు, కాంట్రాక్టర్ నవీన్, స్థానిక నాయకులు ఫ్యాక్టరీ శ్రీను, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, శోభన్, క్యాంప్ కార్యాలయ ప్రతినిధి ఆవిర్నేని శ్రీకాంత్ లతో క్షేత్రస్థాయి పరిశీలన చేయించారు. డ్రెయిన్ వెడల్పు 6 మీటర్లుగా పెంచడం, సర్వీస్ రోడ్ నిర్మాణం ప్రారంభించాలని నిర్ణయించారు.

నీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

ప్రజాశక్తి - కనిగిరి



వైవిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

రాజ్య సభ సభ్యులు వైవి సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ గురువారం కలిసి రాబోయే వేసవి నీటి ఎద్దడి తీవ్రతను ఎదుర్కొనేందుకు రూ.25 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి అంచనాలు తయారు చేసి పంపితే మార్చిలో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రాచపూడి మాణిక్యరావు, కో ఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, కౌన్సిలర్లు రామన బోయిన శ్రీనివాసులు యాదవ్, పులి శ్రీనివాసులు, పసుపులేటి అరుణోదర్ పాల్గొన్నారు.

రసాభాసగా మండల సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, ఎక్సైజ్‌శాఖ, అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధికారులు గైర్హాజరు అవ్వటంపట్ల వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, జడ్పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. మండలంలో 80కిలో మీటర్ల ఆర్అండ్‌బి రోడ్డు విస్తరించి ఉందని, పలు చోట్ల గుంతలు పడి అధ్వనంగా మారాయని చెప్పారు. ఉపాధి పనుల మంజురాకు సభ్యుల తీర్మానం లేకుండా ఎలా ఆమోదించారని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ బులేన్‌రావును, ఎంపిడిఓ ఈశ్వరమ్మను గోట్లగట్టు ఎంపీటీసీ ఉడుముల రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. వద్దిమడుగు నుంచి చౌటపల్లెకి వెళ్లే రహదారిలో ఇరువైపులా చిల్ల చెట్లు పెరిగి ఇబ్బంది కరంగా మారిందని ఎంపీటీసీ చక్కెర వెలుగొండయ్య అన్నారు. ఆయా పోస్టును భర్తీ చేయాలని చిన్నారికట్ల సింగిల్ విండో అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. కొత్త టీచర్లు వచ్చిన వెంటనే భర్తీ చేస్తామని ఎస్‌కే.డాంగే షరీఫ్ సమాధానం చెప్పారు. సమావేశంలో సభ్యులు కాని వారు హాజరు కావడం ఏమిటని, ఎంపీటీసీలమైన తాము ఉండాలా, వారు ఉండాలాని ఎంపీటీసీ రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. చిన్నారికట్ల చెరువు సంఘం అధ్యక్షులు దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడటంపై కొద్దిసేపు వాగ్వి వాదం జరిగింది. కార్యక్రమంలో ఎఒ కె ప్రకాష్‌రావు, ఏఇ బ్రహ్మం, పశువైద్యాధికారి మోహన్‌కృష్ణ, హౌసింగ్ ఏఇ బాలునాయక్, పిఆర్ఏఇ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐ కళాశాలలో విచారణ చేస్తున్న అధికారి జుబేర్

దాడి ఘటనపై విచారణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక గుళ్ళపల్లి ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ కొట్టిన ఘటనపై ఇంటర్మీడియట్ జిల్లా అధికారి జుబేర్ కళాశాలకు వచ్చి గురువారం విచారించారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలల్లోని సిసి కెమెరాలు పరిశీలించారు. సంఘటన పట్ల సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగిన విషయాన్ని తెలుసుకొని విచారణకు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు, తోటి విద్యార్థులను విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసుల అదుపులో విఆర్ఓ తనయుడు సత్యనారాయణ

ప్రజాశక్తి - పీసీపల్లి

విఆర్ఒ బి సుబ్బారావు తనయుడు సత్యనారాయణను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జి కోటయ్య తెలిపారు. మండలంలోని పెద ఇర్లపాడుకు చెందిన అద్దంకి విజయ్, అద్దంకి రామయ్య, అత్యాల బాలయ్య, అరిగల సుందరావు, అత్యాల దావీదు, అత్యాల వినోద్ బాబు, అద్దంకి పేరయ్య, అద్దంకి విశ్రాంతమ్మ భూములకు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు 2023లో రూ.3.10లక్షలు డిమాండ్ చేసి లంచంగా తీసుకున్నాడు. సత్యనారాయణ తండ్రి సుబ్బారావు అప్పట్లో పెద ఇర్లపాడు విఆర్ఓగా పనిచేశారు. తండ్రిని అడ్డుపెట్టుకొని పాస్ పుస్తకాల కోసం డబ్బు తీసుకుని పుస్తకాలు ఇవ్వకపోగా, బాధితులను గత రెండేళ్లుగా అనేకసార్లు తిప్పుకున్నాడని బాధితులు పిర్యాదు చేశారు. దిక్కున చోట చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు బెదిరించాడని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక తహశీల్దార్ ఉషాకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు అదుపులో తీసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్ తీగలకు తగిలిన టిప్పర్

ప్రజాశక్తి - సిఎస్‌పురం

గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మిస్తున్న మేఘ కంపెనీకి చెందిన ఓ టిప్పరు కంకర అధికంగా లోడు వేసుకుని వెళుతుండగా స్థానిక కెజిబివి ప్రాంతంలో విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుత్ తీగ ఉన్న పింగాణి పగిలి తీగ కాసారంపై పడి మంటలు లేచాయి. దీంతో ఆ ప్రాంతంలో ఉన్నవారు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. ముండ్లపాడుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది కాసారాన్ని విద్యుత్ తీగను సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



దాతలను అభినందిస్తున్న దృశ్యం

వెంగళాయపల్లి పాఠశాలకు విరాళాలు

ప్రజాశక్తి - పీసీపల్లి

మండలంలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాలకు యేరువ చెంచయ్య రూ.10వేల విలువైన బీరువ, పెద ఇర్లపాడుకు చెందిన గోపిరెడ్డి లక్ష్మిరెడ్డి ఎలక్ట్రికల్ పైప్స్, బోర్డ్సుకు రూ.10వేలు శుక్రవారం అందించారు. ప్రభుత్వ పాఠశాలకు సహాయం అందించడం అభినందనీయమని హెచ్ఎం స్వర్ణ రమణయ్య అన్నారు. ప్రభుత్వంతోపాటు దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల్లో విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దాతలను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు మాధవరావు, రంగనాయకులు, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, బీసీ సెల్ నాయకుడు కోమటికుండ్ల వీరయ్య, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శుక్రవారం 10 అక్టోబర్ 2025



మెగా వైద్య శిబిరం ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని క్రాప గ్రామంలో తలశిల సీతారాం బాబు జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం విజయవాడ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పటల్, హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. టిడిపి అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, వేమూరు సిఐ పసుపులేటి వీరాంజనేయులు, ఎస్‌ఐ జానకి అమరవర్ధన్ వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. 500మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

ఏడాదిలో చేసిన అభివృద్ధి వివరించండి

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటింటికి వెళ్లి వివరించాలని టిడిపి మండల అధ్యక్షులు సానికోమ్ము తిరుపతిరెడ్డి, గాయం తిరుపతిరెడ్డి కుటుంబ సంక్షేమ సారథులకు సూచించారు. హాజీపురంలో కెఎస్‌ఎస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, గాయం రామిరెడ్డి, గాయం సుబ్బయ్య, తాతపూడి బుజ్జి, చీకటి వెంకటసుబ్బయ్య, గోన ఇర్మియా, రఘునాధ కాశిరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, బలసాని కోటయ్య, సుమిత్ర, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం, బిఆర్‌సి అగ్రిగేటర్స్ షాప్ గురువారం ప్రారంభించారు. డిపిఎం సయ్యద్ అక్తర్ హుస్సేన్ మాట్లాడారు. డిపిఎం మోహన్, ఎన్ఎఫ్ఎ శ్రీవల్లి, ఎంటి భారతి, వేటపాలెం ఏఈఓ మున్నంగి జస్వంత్ ఇశ్రా పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి -సిఎస్‌పురం రూరల్

మండల స్థాయి ఆటల పోటీలు డిజిపేటలో ఉత్సాహభరితంగా జరిగాయి. అండర్ 14, 17 విభాగాల్లో బాల, బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. డిజిపేట, అంబవరం, పెదరాజుపాలెం, సి నాగులవరం, అరివేముల జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు, కెజిబివి విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈఓ జె ప్రసాదరావు పోటీలు ప్రారంభించారు. హెచ్ఎంలు పీఎం రసూల్, ఓ వెంకటేశ్వర్లు, కె వెంకటేశ్వర్లు, షేక్ షరీఫ్, పీఈటీలు ఈరి చంద్ర, పిడి నాయబ్ రసూల్, కాజా మస్తాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అంగన్‌వాడి కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందే విధానంపై ఢిల్లీ నీతి అయోగ్ ఆదేశాల మేరకు వైజాగ్ పాపులేషన్ సెంటర్ ఎన్యుమరేటర్ వెంకటరమణ మండలంలోని వలపర్ల, బండ్లదొడ్డి అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్చూరు సిడిపిఒ గాదే సుభద్ర తోకలిసి గురువారం పరిశీలించారు. చిన్నారుల బరువు, ఎత్తు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ తలమాల శిరీష, రేచల్ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - పామూరు

శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహరెడ్డి అదేశాల మేరకు స్థానిక మహాలక్ష్మి మిల్క్ డైరీ ఆవరణలో కెఎస్ఎస్ భాధ్యతల సమావేశం నిర్వహించారు. టిడిపి అధ్యక్షుడు బొల్లా నరసింహారావు ఆధ్వర్యంలో ఎఎంసి చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - రేపల్లె

నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.16.20 కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లె - నిజాంపట్నం, చందోలు - నిజాంపట్నం, పెనుమూడి - లంకవానిదిబ్బ రహదారులు రూపురేఖలు కోల్పోయాయి. సీఎం చంద్రబాబు, ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డికి రోడ్ల దుస్తిని వివరించినట్లు తెలిపారు. తన విజ్ఞప్తితో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.16.20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించి రోడ్ల సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్

కనిగిరి : టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి గ్రౌండ్లో టిడిపి శ్రేణుల సమావేశం నిర్వహించారు. రోడ్ల అభివృద్ధికి నియోజకవర్గానికి రూ11.30 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమళ్ళ శ్రీనివాసులురెడ్డి, షేక్ జంషీర్ అహ్మద్, చిరంజీవి, రోషన్ సంధాని, తమ్మినేని వెంకటరెడ్డి, బుల్లా బాలబాబు, షరీఫ్, అచ్చాల రవి, కరణం అరుణ, దొరసాని, వాజిద పాల్గొన్నారు.

పర్చూరు : నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రు.13.80 కోట్లు మంజూరు చేసినట్లు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు తెలిపారు.

యద్ధపూడి : మండలంలోని అన్నిగ్రామాల్లో మురుగు కాలువలు, సిసి రోడ్ల నిర్మాణంకు జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద నిధులు మంజూరు అయ్యాయి. 86పనులకు ఎన్ఆర్ఇజిఎస్ నుండి రూ.10.32 కోట్ల నిధులు మంజూరు చేశారు. అనంతవరం, యనమదల, పూనూరు, పోలూరు, యద్దనపూడి, శ్యామలవారిపాలెం, తనుబొద్దివారిపాలెం, చిమటవారిపాలెం, గన్నవరం, జాగర్లమూడి, మున్నంగివారిపాలెం, చింతపల్లిపాడు గ్రామాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు నిధులు మంజూరు చేయించారు.

జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అంశంపై ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు స్థానిక శ్రీ హర్షిణి విజయతేజ డిగ్రీ కాలేజీలో అవగాహన నిర్వహించారు. చార్టెర్డ్ అకౌంటెంట్ దామా సతీష్ బాబు విద్యార్థులకు జీఎస్టీ గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి రమేష్ బాబు, ఎఒ తోకల రాజేష్ పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని చెరుకూరు పిహెచ్‌సి నందు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తగ్గించిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య రంగంలో మందులు, ఆక్సిజన్ సిలిండర్లు, ఆరోగ్య పరీక్ష పరికరాలు, జీవిత, ఆరోగ్య భీమాలపై పన్ను భారం తగ్గిందని తెలిపారు.

కారంచేడు : మండలంలోని స్వర్ణ పిహెచ్‌సి ఆవరణలో జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనాలను రోగులు, ప్రజలు, సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం మధుసూదనరావు, ఇన్చార్జ్ డాక్టర్ డి ప్రదీప్ కుమార్, హెచ్ఈ మాధవి, మాధురి, సి పోరా, ఎల్‌టి బయ్య శంకర్, నాగలక్ష్మి, అశ్విని పాల్గొన్నారు.

పీసీపల్లి : జిఎస్టి తగ్గింపుతో ప్రజలకు ఊరట కలుగుతుందని ఎంపిడిఒ జివి కృష్ణారావు అన్నారు. మండలంలోని పిహెచ్‌సి ఆవరణలో ఆశ వర్కర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు.

మెదరమెట్ల : మండలంలోని కోరిసపాడు పంచాయతీ వద్ద జీఎస్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్ రాజేశ్వరి, పంచాయితీ కార్యదర్శి డికె కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు కోరుతూ ఆందోళన

ప్రజాశక్తి - పీసీపల్లి

తమ గ్రామానికి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కనిగిరి విద్యుత్ కార్యాలయం వద్ద మండలంలోని పెద ఇర్లపాడు దళిత కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. పాత స్థంబాలు వంగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యుత్ వైర్లు చెట్లకు వేడుతూ ప్రమాదరకంగా ఉన్నాయని తెలిపారు. తమ గ్రామ విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అత్యాల మోసే, అంకయ్య, అద్దంకి ఆనందరావు, సామ్సన్, అత్యాల ఏలియ, డేవిడ్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న పెద ఇర్లపాడు దళితులు

ఎయిడ్స్ వ్యాధికి మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి అద్దంకి వైద్యశాలలో ఎఆర్‌టి సెంటర్ మంజూరు చేసినట్లు అధికారి డాక్టర్ సోమల నాయక్ పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ కెకె వాహిలా చౌదరి, దిషా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ బాషా, హెల్ప్ సంస్థ టీఐ ప్రొజెక్టర్ బివి సాగర్ తోకలిసి హాస్పటల్ సందర్శించారు. డాక్టర్ ఎస్ తేజస్విని, డాక్టర్ అనిత జ్యోతి, ఐసిటిసి కౌన్సిలర్ రమేష్, పారా మెడికల్ ఆఫీసర్ ఎన్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం మేనేజర్ బి దుర్గ సురేంద్ర, ఔట్రిచ్ వర్కర్ దుర్గాభవాని పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితం పాడు చేసుకోవద్దని డిఎస్‌పి మహ్మద్ మొయిన్, రూరల్ సీఐ శేషగిరిరావు సూచించారు. చీరాల ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి ప్రవర్తనతో చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పురుషోత్తం పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నిజాంపట్నం

సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మండలంలోని అడవులదీవి సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు శొంఠి శ్రీనివాసరావు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తుండగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



శ్రీనివాసరావు

10 నుండి ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని 2024-25వ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులతో జరిగిన పనులపై ఈనెల 10 నుండి 17 వరకు సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తారని ఎపిఒ ఎం బాలకృష్ణ నాయక్ తెలిపారు. 18న మండల సభ జరుగుతుందని తెలిపారు. 760 పనులకు రూ.10.50 కోట్ల ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎంపిడిఒ జ్యోతిర్మయి, ఈసీ సురేష్, ఎస్ఆర్ పి నాగరాజు పాల్గొన్నారు.



స్లైట్ కట్ సమస్య ఎంపికి వివరిస్తున్న మత్స్యకారులు

గంగపుత్రులకు అండగా ఉంటా

ప్రజాశక్తి - బాపట్ల

ఈపురుపాలెం స్ట్రైట్ కట్ సమస్యపై పోరాడుతున్న మత్స్యకారులకు అండగా ఉంటానని ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. సీమౌత్ వద్ద మలుపు సమస్యపై మత్స్యకారులు, రియల్టర్లకు మధ్య జరుగుతున్న వివాదాన్ని మత్స్యకారులు ఆయనను కలిసి వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టరు ఈ సమస్యపై కమిటీ వేశారని, ఈనెల 13న కమిటీ నివేదిక వస్తుందని, దీనిపై సమగ్ర విచారణ అనంతరం మత్స్యకారుల సమస్య పరిష్కరిస్తామని కలెక్టరు చెప్పినట్లు వివరించారు. ఎంపిని కలిసిన వారిలో పిక్కి దేవుడు, చోడిపిల్లి తాతారావు, పిక్కి సూర్యారావు, మాజీ సర్పంచి ఎరిపిల్లి రమణ, ఓసిపిల్లీ సూరిబాబు, పిక్కి నారాయణరావు, మచ్చా సువార్త, ఏసుబాబు, బాబ్జి, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ మించాల సాంబశివరావు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో పారిశుధ్యం మెరుగుదల, డ్రైనేజీ పారుదలపై ప్రత్యేక దృష్టి వహించాలని మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్లో సిబ్బందితో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో చెత్త సేకరణ, డ్రైనేజ్ శుభ్రత, మురుగు నీటి పారుదల, వీధుల శుభ్రత వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో డిఈ రఘురామ్, మేనేజర్ శ్రీనివాసన్, అజయ్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైన జట్టు

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో పాల్గొనే అండర్ 19 ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు ఎంపికైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పిడి మేకల సీతారామరెడ్డి తెలిపారు. సీనియర్ క్రీడాకారులు ఎస్‌కె అహ్మద్, పిడి రవికిరణ్‌రెడ్డి, వేణు పాల్గొన్నారు. 12 మంది క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో జరగబోయే అండర్ 19 బాలుర రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి పాల్గొంటారని జిల్లా కార్యదర్శి ఎం చింపారెడ్డి తెలిపారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - కర్లపాలెం

బాల్యం నుండే పోటీతత్వం అలవర్చుకోవడం వలన జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకుంటారని హెచ్ఎం అపర్ణ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్యార్లీ జెడ్పిహెచ్ స్కూల్‌లో వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడి ఎస్ సూపర్వైజర్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 36 మంది లబ్ధిదారులకు 65 లక్షల 36 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైంది. ఒంగోలు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఎమ్మెల్యే దామచర్ల లబ్ధిదారులను చెక్కులను అందజేశారు. ఈ సహాయాన్ని ఉపయోగించుకొని బాధితులు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



విద్యాసామగ్రి అందజేస్తున్న దాతలు

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని పాటిమీద పాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఉద్యోగి, పూర్వ విద్యార్థి కూడల బ్రహ్మేంద్ర త్రివేణి దంపతులు విద్యాసామగ్రి అందజేశారు. గురువారం వీరి కుమారుడు దుష్యంత్ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా సామాగ్రి అందజేసి భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ప్యాడ్స్, నోటు పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ నాయకులు ఇస్తర్ల ఏడుకొండలు, చందు, విద్యా కమిటీ చైర్మన్ బిల్లా శ్రీనివాసరావు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.కె శిలార్, ఉపాధ్యాయులు ఎస్వి సంజీవి, ఎం.విజయలక్ష్మి, వాకా కవిత, గ్రామస్తులు కూడల ఎలమంద, మేళం వెంకటసుబ్బయ్య, కూడల అంజయ్య సంపూర్ణ దంపతులు, కీర్తిపాటి ఎరుకల, కె.శ్రీను, ప్రేమ్ కుమార్, యాదగిరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి లేఖ రచన పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి డాయి ఆఖర్ పేరుతో జాతీయ స్థాయి లేఖ రచన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ మహ్మద్ జాఫర్ సాధిక్ గురువారం తెలిపారు. ఈ పోటీలు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. లెటర్ టు మై రోల్ మోడల్ అనే అంశంపై పాల్గొనవలసి ఉంటుందన్నారు. ఈ పోటీలు 18 ఏళ్ల లోపు, 18 ఏళ్లు పైబడినవారికి రెండు కేటగిరీలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. లేఖలను ఏ4 సైజు పేపర్లో గరిష్టంగా వెయ్యి పదాలకు మించకుండా లేదా ఇన్లాండ్ లెటర్ కార్డులో (గరిష్టంగా 500 పదాలు) వ్రాయవచ్చని చెప్పారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీతోపాటు రాజ్యాంగం గుర్తించిన ఏ భాషలోనైనా లేఖలు వ్రాయవచ్చని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రూ.25,000, రూ.10,000, రూ.5,000 నగదు బహుమతులు, జాతీయ స్థాయిలో రూ.50,000, రూ.25,000, రూ.10,000 నగదు బహుమతులు అందజేయబడతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ లేఖలను డిసెంబర్ 8, 2025 లోపు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, ప్రకాశం డివిజన్, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు - 523001 చిరునామాకు పంపవలసి ఉంటుందని ఆయన తెలిపారు.

11న ఏపిటిఎఫ్ విద్యా సదస్సు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడులో 11న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటిఎఫ్ మండల కార్యదర్శి గుమ్మడి సురేష్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి శ్రీ డోలా వీరాంజనేయ స్వామి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, బిఎన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

'జిఎస్‌టి'తో వైద్య రంగానికి ప్రయోజనం

అవగాహన ర్యాలీ ప్రారంభించిన జెసి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిఎస్‌టి 2.0 సంస్కరణలతో వైద్య రంగానికి ప్రయోజనం కలుగుతుందని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. ఒంగోలు ప్రకాశం భవనం వద్ద గురువారం జిఎస్‌టి 2.0 ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రకాశం భవనం నుంచి రిమ్స్ ఆడిటోరియం వరకు సాగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి 2.0 సంస్కరణలతో వైద్య చికిత్సలు పొందేందుకు నిత్యం ప్రజలు ఉపయోగించే మందులు, వైద్య పరికరాలు అత్యవసర మందులపై 12 నుండి 5 శాతం వరకు తగ్గించారన్నారు. కొన్ని మందులపై పూర్తిగా తొలగించటంతో ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గుతున్నాయన్నారు. డిఎం,హెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిఎస్‌టి 2.0తో ప్రాణ రక్షక మందులు ధరలు తగ్గుతాయని, ఆరోగ్య, జీవిత బీమా తీసుకోవడం సులభం అవుతుందన్నారు. అదనపు డ్రగ్ కంట్రోలర్ పిఎస్ జ్యోతి మాట్లాడుతూ జిఎస్‌టి 2.0తో ప్రాణ రక్షక ధరల మందులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్పెక్టర్ పి.శ్రీరామమూర్తి, డి.కృష్ణారెడ్డి, వేముల సుబ్బారావు, ఒంగోలు రిటైల్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వెంకటరెడ్డి, హోల్‌సేల్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంకిరెడ్డి, పిసిడి అసోసియేషన్ అధ్యక్షులు వి.వెంకటరావు డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎం.శ్రీనివాస నాయక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సూరిబాబు, ఆర్‌బిఎస్‌కె నోడల్ అధికారి డాక్టర్ భాగీరధి, జిల్లా మాస్ మీడియా అధికారి బెల్లం నరసింహ రావు, ఇన్‌చార్జి మాస్ మీడియా అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో యమ్.సరోజినీ హెల్ప్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి బివి సాగర్, నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న జెసి గోపాలకృష్ణ

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా ఎస్పీ వి.హర్ష వర్ధన్ రాజు



సమావేశంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కొత్తగా అమలులోకి వచ్చిన క్రిమినల్ చట్టాల ప్రకారం, ప్రతి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించవలసిన రికార్డుల నిర్వహణ మరియు నూతన ప్రొఫార్మాలపై అవగాహన కల్పించేందుకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలక్సీ కాంప్లెక్స్‌లో జిల్లా ఎస్పీ ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ యస.హెచ్.ఒ లు, అన్ని స్టేషన్ ల రైటర్లు, అసిస్టెంట్ రైటర్లు మరియు టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించే లక్ష్యంతో రూపొందించిన కొత్త చట్టాలపై ప్రతి పోలీసు అధికారికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. నూతన చట్టాలకు అనుగుణంగా రూపొందించిన రిజిస్టర్లను తప్పనిసరిగా, నిక్కచ్చిగా నిర్వహించాలని ఆదేశించారు. నూతన చట్టాల ప్రధాన లక్ష్యం డిజిటలైజేషన్ మరియు వేగవంతమైన న్యాయం సాధన అని, దీనిలో భాగంగా జీరో ఎఫ్ఐఆర్ , ఈ-ఎఫ్ఐఆర్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో రికార్డుల నిర్వహణ కీలకమన్నారు. రికార్డులన్నింటినీ క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సి.సి.టి.యన్.యస్) పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఒంగోలు టుటౌన్ సీఐ శ్రీనివాసులు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మెడికల్ కాలేజీల కోసం వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీల పూర్తి స్థాయి కార్యకలాపాల ప్రారంభం కోసం వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీలు ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందించే దిశగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో వైద్య రంగ బలోపేతానికి నిరసన ప్రదర్శనలు చేపట్టాలని, 23న నియోజకవర్గాల నుండి జిల్లా కేంద్రాల వరకు పెద్ద ఎత్తున ర్యాలీలు, సమావేశాలు 24న జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి చలో కార్యక్రమం, 26న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలో భాగంగా విజయవాడలో ముగింపు సభ జగన్ మోహన్ రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు కసుకుర్తి ఆదెన్న, కేవి రమణా రెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బోధనేతర కార్యక్రమాల కారణంగా బోధనా నాణ్యత దెబ్బతింటోందని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ప్రకాశం జిల్లా ఫ్యాప్టో డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఆదిలక్ష్మి, జిల్లా డీఆర్ఓ చిన ఓబులేసులకు ఫ్యాప్టో ప్రతినిధులు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.ఎర్రయ్య మాట్లాడుతూ గత కొంతకాలంగా ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం అమితంగా పెరిగిపోవడంతో, బోధనకు కేటాయించాల్సిన సమయం హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్ర ఫ్యాప్టో కమిటీ నిర్ణయానుసారం 10 నుంచి అన్ని బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఉపాధ్యాయులు ఇకపై విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, పరీక్షల నిర్వహణ వంటి పనులు మాత్రమే చేపడతారని, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 వంటి ప్రచార కార్యక్రమాలు, గూగుల్ షీట్లు నింపడం వంటి అనవసర పనులను చేపట్టబోమని స్పష్టం చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఫ్యాప్టో 'పోరుబాట' సమావేశంలో తీసుకున్న తీర్మానానుసారం ఈ నిర్ణయం అమలు తలపెట్టినట్లు నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ షేక్ అబ్దుల్ హై, కో-చైర్మన్ వి.మాధవరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసులు, పి.వి.సుబ్బారావు, జి.ఉమామహేశ్వరి, సి.హెచ్. ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

వైవి సుబ్బారెడ్డిని కలిసిన వైసీపీ నాయకులు

ప్రజాశక్తి-మద్దిపాడు

రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డిని మండలంలోని పలువురు నాయకులు గురువారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పార్టీ కార్యక్రమాలపై భవిష్యత్తులో ఏవిధంగా ముందుకు వెళ్లాలి అనే విషయాలపై చర్చించారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో ఒంగోలు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి చుండూరు రవి, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రెటరీ దుడ్డు వినోద్ కుమార్, ప్రకాశం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్, దుంపా చెంచిరెడ్డి, వాకా కోటిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.



వైవీ సుబ్బారెడ్డితో వైసీపీ నాయకులు

చిన్నారులలో నైపుణ్యాల పెంపునకు కృషి

ప్రజాశక్తి-మద్దిపాడు

అంగన్‌వాడీ సెంటర్లలోనీ చిన్నారుల్లో నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు సిడిపిఓ పిఆర్ ఇవాంజలిన్ తెలిపారు. మండల కేంద్రమైన మద్దిపాడులోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు ప్లే మెటీరియల్స్‌ను ఐటిసి ప్రథమ్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఎస్.వెంకట్రావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ మద్దిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 12 సెక్టార్లలో గల హబ్ అంగన్వాడి సెంటర్స్‌కు ఐటిసి ప్రథమ్ వారి సహకారంతో 11 రకాల ప్లే మెటీరియల్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఇవి చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో 12 సెక్టార్ల సూపర్వైజర్లు, హబ్ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.